www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 జనవరి 2024



పల్ల వెంకన్న నర్సరీలో 'రిపబ్లిక్ డే'

ప్రజాశక్తి-కడియం

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సుదినం రిపబ్లిక్ డేను పురస్కరించుకుని కడియం పల్ల వెంకన్న నర్సరీలో మొక్కలతో శుభాకాంక్షలు కూర్చారు. 75వ గణతంత్ర వేడుకలకు మువ్వన్నెల రంగులతో సీతాకోకచిలుక ఎగురుతున్నట్టు నర్సరీ డైరెక్టర్ పల్ల వెంకటేష్, వినయ్ సందేశాత్మకమైన కూర్పును తీర్చిదిద్దారు.



ఫిబ్రవరి 10, 11న గోదావరి బాలోత్సవం

రాజమహేంద్రవరంలో 2వ పిల్లల పండుగ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఫిబ్రవరి 10, 11వ తేదీలలో గోదావరి బాలోత్సవం 2వ పిల్లల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు వివిఎస్ కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.తులసి తెలిపారు. నగరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ప్రాంగణం ఈ కార్యక్రమానికి వేదిక కానుందని తెలిపారు. గోదావరి బాలోత్సవ్ ఆధ్వర్యంలో గణేష్ చౌక్ లోని ప్రెస్ క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.తులసి మాట్లాడుతూ గోదావరి బాలోత్సవం 2వ పిల్లల పండుగ కార్యక్రమాన్ని జనవరి 27, 28వ తేదీల్లో నిర్వహించేందుకు తొలుత షెడ్యూల్ జారీ చేశామని విద్యార్థుల పరీక్షల నేపథ్యంలో ఫిబ్రవరి 10, 11వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు. కల్చరల్, అకడమిక్ రెండు విభాగాల్లో 36 రకాల అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. రిజిస్ట్రేషన్ గడువు తేదీని ఈ నెల 31వ తేదీ వరకూ పొడిగించినట్టు తెలిపారు. రాజమండ్రి సిటీ, రూరల్, కడియం, సీతానగరం, రాజానగరం, కోరుకొండ మండలాల్లో దాదాపు 700 స్కూల్స్ ఉన్నాయని, అందరినీ భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని, తల్లి దండ్రులు చిన్నారులను ఆ దిశగా ప్రోత్సహించాలని అన్నారు. అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణకుమార్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం కొత్తగూడెంలో ప్రారంభించిన బాలోత్సవం కార్యక్రమం విశేష ఆదరణ చూరగొందని అన్నారు. చిన్నారుల్లో మానసిక వికాసానికి దోహద పడుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గతేడాది రాజమహేంద్రవరంలో గోదావరి బాలోత్సవం నిర్వహించిన కార్యక్రమంలో 10 వేల మంది విద్యార్థులు హాజరై మనసారా విజయవంతం చేశారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు అధ్యక్షునిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు గౌరవ సలహాదారులుగా మరో 100 మందితో ఆహ్వానం సంఘం ఏర్పాటు చేసి బాలోత్సవం విజయవంతానికి కృషి చేస్తోందని తెలిపారు. నగరంలోని ప్రముఖులు, విద్యాసంస్థలు, అభ్యుదయ, ప్రజాస్వామిక వాదులు అందరూ గోదావరి బాలోత్సవం 2వ పిల్లల పండగను జయప్రదం చేయడానికి సహకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరి బాలోత్సవం ఉపాధ్యక్షులు కామేశ్వర శర్మ, కార్యదర్శి పి.మురళీకృష్ణ, కాశీవిశ్వనాథ్, దాసరి సాయిబాబు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలోత్సవ నిర్వాహక కమిటీ నాయకులు

గణతంత్ర వేడుకలకు విద్యార్థులు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

గణతంత్ర వేడుకల సందర్భంగా తాడేపల్లిలో నిర్వహించే పెరేడ్‌కు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.విశ్వప్రసాద్ గురువారం తెలిపారు. సైనిక వీరుల ధైర్య సాహసాలు, జీవిత కథలను రాయడం ద్వారా విద్యార్థుల దేశ భక్తి పెంచేందుకు కేంద్ర రక్షణ శాఖ, విద్యా శాఖలు సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో తొమ్మిదవ తరగతి విద్యార్థిని కె.పావని రాష్ట్రస్థాయి పద్య విభాగానికి, జిల్లా స్థాయి పద్య విభాగంలో కె.నవ్యశ్రీ లు ఎంపికయ్యారన్నారు. వీరిని తీర్చి దిద్దిన ఉపాధ్యాయుడు జి.మహేష్ కుమార్‌ను తహశీల్దారు జి.కనకరాజు అభినందించి, విద్యార్థినులకు రూ.వెయ్యి చొప్పున నగదు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ సక్సేనా రాజు, విఆర్ఒ పాపారావు, ఆర్ఎన్.లక్ష్మి, డి.శ్రీనివాస్, చిరంజీవి, ఎన్.పద్మావతి, ఐ.రాంబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుంకవల్లి సత్తిరాజు

18 వార్డులో మంత్రి వేణు 'గుడ్ మార్నింగ్'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ గురువారం 18వ వార్డులోని పలు ప్రాంతాల్లో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. కొండావారి వీధి, పాలిక వారి వీధి, గుత్తులవారి వీధి, కేతావారి వీధి, ఉరం వారి వీధి, కట్టుమూరు వారి వీధి, గోడేవారి వీధుల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా నగరపాలక సంస్థ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతో కూడిన స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరం స్వచ్ఛతకే ప్రాధాన్యత నిస్తూ ఆ దిశగా మనమందరం అడుగులు వేద్దామని మంత్రి అన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. మంత్రి వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎ.వినూత్న, అధికారులు సిబ్బంది, మిందే నాగేంద్ర, కుప్పినీడి ప్రసాదు బాబు, చిగురుమిల్లి చిన్న పాల్గొన్నారు.



చాగల్లులో ధర్నా చేస్తున్న పెన్షనర్స్

సమస్యలపై యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తమ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనను ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాలకు పిలుపునిస్తే ముందుగా అనుమతినిచ్చి, అనంతరం రద్దు చేయడం, యుటియఫ్ కార్యాచరణకు అనుమతి ఇవ్వకపోవడం ఎలాంటి ప్రజాస్వామ్యమో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ధోరణిని మార్చుకొని ప్రజాస్వామ్య పోరాటాలపై నిర్బంధాలు విధించడం మానుకోవాలని ఎన్ని నిర్బంధాలు విధించినా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. సహాధ్యక్షురాలు ఎం.విజయగౌరి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, పిఎఫ్ తదితర సమస్యల పరిష్కారానికి గడచిన 2 నెలలుగా స్థానిక, జిల్లా స్థాయిలో పోరాటాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోని సందర్భంలోనే 25వ తేదీన రాష్ట్ర స్థాయి ధర్నాకి పిలుపు ఇచ్చామని తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ 30వ తేదీ రాష్ట్ర ధర్నాకు పిలుపునిస్తే, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పి ధర్నాను ప్రభుత్వం వాయిదా వేయించిందని, కాని నేటికీ ఒక్క సమస్య పరిష్కారం కాని పరిస్థితిలో అనివార్యంగా మరోమారు రాష్ట్ర ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు, కార్యదర్శులు ఇ.శ్రీమణి రమేష్ బాబు, నగర శాఖ అధ్యక్షుడు జి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి జెవివి.సుబ్బారావు, సహాధ్యక్షురాలు జెడి.సుహాసిని, కోశాధికారి ఎస్.తేజ విజయ్‌కుమార్, శివాజీ, నారాయణ, రాజగోపాల్, కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

'గణతంత్ర భారతం'పై అవగాహన

ప్రజాశక్తి-దేవరపల్లి

యర్నగూడెం లోని జూనియర్ కళాశాల విద్యార్థులకు సామాజిక విశ్లేషకుడు, కాలమిస్ట్ సుంకవల్లి సత్తిరాజు 'గణతంత్ర భారతం' అనే కార్యక్రమంలో అవగాహన కల్పించారు. సత్తిరాజు మాట్లాడుతూ, ప్రపంచంలో ఆర్థిక మాంద్యం కొనసాగుతున్నప్పటికీ భారత దేశం తట్టుకుని నిలబడగలగడం విశేషమని పేర్కొన్నారు. దేశ ప్రజల శ్రమశక్తి, యువశక్తి దీనికి కారణమని, భారత దేశానికి యువత ఒక వరమని, యువతకు చదువుతో పాటు, నైపుణ్యత అత్యంత ఆవశ్యకమని వివరించారు. ఇప్పటికే భారతదేశం ప్రపంచంలో 5వ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ప్రపంచ జనాభాలో మొదటి స్థానం ఆక్రమించిన భారత్ ఆర్థికంగా కూడా అగ్రదేశాలకు ధీటుగా ఎదగాలని సుంకవల్లి సత్తిరాజు ఆకాంక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ ధర్నా

ప్రజాశక్తి-చాగల్లు, గోకవరం

తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్స్ ఎపి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన గురువారం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కరువు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని నినాదాలను చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, కార్యదర్శి కెవిఎస్ఎన్.మూర్తి, ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దారు నిరంజన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు కె.సత్యవాణి, దాసరి నాగేశ్వరరావు వెత్సా గంగాధరం పాల్గొన్నారు.

గోకవరం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు తహశీల్దారు, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహశీల్దారు శ్రీనివాస్, ఎంపిడిఒ పద్మజ్యోతికి వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ గౌరవాధ్యక్షుడు ఎస్.కుమార్, కార్యదర్శి డి.గంగాధర్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం రామకృష్ణారావు, పిల్లంగోరు పాపారావు, జె.గవర్రాజు, ఎం.చిన్నికృష్ణ, ఆర్‌సి.వర్మ, ఎస్.వెంకట్రావు, గుత్తుల అప్పారావు, తోట కృష్ణారావు, షేక్ బాషా, ఎఎస్ఎన్.మూర్తి, ఎండి షాజహాన్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న హోమ్ మంత్రి వనిత

హోమ్ మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని యర్నగూడెంలో వైసిపి గోపాలపురం నియోజవర్గ క్యాంపు కార్యాలయాన్ని హోమ్ మంత్రి తానేటి వనిత గురువారం ప్రారంభించారు. కార్యాలయంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికిపూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గానికి పార్టీ ఇన్‌ఛార్జిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని, నాయకులకు ప్రజాప్రతినిధులకు నిత్యం అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ స్మార్ట్ సిటీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వర రావు, జెడ్‌పి చైర్మన్ శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ జి.జనార్ధనరావు, జెడ్‌పిటిసి పి.స్వర్ణలత, కూచిపూడి సతీష్, కారుమంచి రమేష్‌బాబు, వెలగా శ్రీరామ్మూర్తి, ఆచంట అనసూయ, గారపాటి రమాప్రభ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి విజయరాజు సస్పెన్షన్

ప్రజాశక్తి-కడియం

పలు అవినీతి ఆరోపణలు వస్తున్న కడియపులంక గ్రామపంచాయతీలో రికార్డులు మాయంపై పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించారు. గత పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుతం దుళ్లలో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న డి.విజయ రాజును సస్పెండ్ చేస్తూ డిపిఒ జె.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాస రెడ్డికి మెమో జారీ చేశారు. ఆరు నెలల్లో ముగ్గురు కార్యదర్శులు గ్రామ పంచాయతీలో పని చేశారు. గ్రామ పంచాయితీపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించారు. విచారణకు ఆదేశించారు. పంచాయతీలో ఎటువంటి రికార్డులూ లేవని గుర్తించిన డిపిఒ తొలుత మెమో జారీ చేశారు, వారి నుంచి స్పందన లేకపోవడంతో విజయరాజును సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.


వర్షానికి ఇటుకులపై బరకాలు కప్పుతున్న కూలీలు

పెరవలిలో అకాల వర్షం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలో గురువారం సాయంత్రం ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు తదితర గ్రామాల్లో చెదరమదురుగా వర్షం పడింది. సాయంత్రం వర్షం పడటంతో జాతీయ రహదారి పక్కన ఆనుకుని ఉన్న ఇటుకుల బట్టీ నిర్వాహకులు పచ్చి ఇటుకలు వర్షానికి తడవకుండా తార్పలిన్‌లను కప్పారు.


సాయం అందిస్తున్న నాయకులు

నాలుగు కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరపల్లి

మండలంలో యాదవోలు, దేవరపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన నాలుగు కుటుంబాల సభ్యులకు టిడిపి, జనసేన పార్టీల నాయకులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. దళిత కుటుంబాలకు రెండు పార్టీల నాయకులు జనసేన దొడ్డిగర్ల సువర్ణ రాజు, టిడిపి ముప్పిడి వెంకటేశ్వరరావు కలిసి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున సహాయం అందించారు. కొయ్యలమూడి చినబాబు, అనిశెట్టి ప్రభాకర్, అనిశెట్టి శ్రీనివాస్, అనిశెట్టి మధు, సుంకర దుర్గారావు, మణికంఠ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా గురువార పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ ఓటు హక్కు మనకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం, ప్రతి ఒక్కరూ అమూల్యమైన ఓటు హక్కును తప్పనసరిగా వినియోగించుకోవాలని తమను పరిపాలించే ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత విజ్ఞప్తి చేశారు. ఆనం కళా కేంద్రంలో సాంస్కృతిక, అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. హక్కుల కోసం అడిగే అవకాశం ఓటు హక్కు వినియోగించుకునే వారికే ఉంటుందని, ఓటు వేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు. ఐదేళ్ల పాటు పాలించే వారిని ఎన్నుకునే అవకాశం మనకు ఉందని తెలిపారు. ప్రజా స్వామ్య వ్యవస్థ లో ఓటు ఒక వజ్రాయుధం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, డిఆర్ఒ జి.నరసింహులు, ఎఎస్‌పి జి.వెంకటేశ్వర రావు, డిఇఒ ఎస్.అబ్రహ్యాం, గిరిజన సంక్షేమాధికారి కెఎస్.జ్యోతి, అదనపు కమిషనర్ పిఎం.సత్యవేణి, డిఐఒ జెవిఎల్.సుబ్రమణ్యం పాల్గొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలో ఇఆర్ఒ ఎస్. సరళా వందనం జెడ్‌పి హైస్కూల్లో సీనియర్ ఓటర్ సిటిజన్స్‌ను సత్కరించారు.

గోకవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.ప్రియదర్శిని ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపిటిసి పులపర్తి బుజ్జి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాళ్లపూడి తహశీల్దారు రాధిక, ఎంపిడిఒ రమణ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ నుండి పైడిమెట్ట జంక్షన్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఇఒపిఆర్‌డి వీరన్న, పలు శాఖల అధికారులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు మండల పరిషత్ పాఠశాలలో సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. విఆర్ఒ మధుబాబు, కె.దినేష్ కుమార్, హెచ్ఎం పిల్లి శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పొన్న శ్వేత, ఎం.అజయ్, బి.విజయదుర్గ, జె.రంజని, ఎం.పావని, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెరవలి తహశీల్దారు టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు అధికారులచే ప్రతిజ్ఞ చేయించి విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, ఆర్ఐ పులిదిండి పావని, విఆర్ఒ సొంగరాజు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత


పెరవలిలో..



తాళ్లపూడిలో..

లక్ష్మీపార్వతికి డాక్టర్ ఆఫ్ లెటర్స్ అవార్డు

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి డాక్టర్ ఆఫ్ లెటర్స్ డిగ్రీని పూర్తి చేసి విసి ఆచార్య కె.పద్మరాజు ద్వారా అవార్డును అందుకున్నారు. ఎపి తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతికి తెలుగులో డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డిలిట్) అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు. 'ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజా నేతల జీవిత చరిత్రలు సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారని చెప్పారు. తెలుగులో నిష్ణాతులైన ఆచార్య బందంచే వైవా నిర్వహించినట్టు చెప్పారు. విద్య, పరిశోధనలకు వయస్సుతో సంబంధం లేదని నిరూపిస్తూ ఎంతో కష్టపడి డి.లిట్ పూర్తి చేసారని ప్రశంసించారు. లక్ష్మీపార్వతికి రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు. తనను ప్రోత్సహించి అవకాశం కల్పించిన సిఎం జగన్మోహనరెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు తదితరులకు లక్ష్మీపార్వతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.కె.రమణేశ్వరి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి పాల్గొన్నారు.



విసి నుంచి అవార్డు అందుకుంటున్న లక్ష్మీపార్వతి

మున్సిపల్ ఉద్యోగులపై దాడి అమానుషం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పరిశుభ్రంగా ఉంచాల్సిన రోడ్లపైన, డివైడర్‌పైన చెత్త పోస్తుంటే వారించిన నగరపాలక సంస్థ ఉద్యోగులపై దాడి చేయడం అమానుషమని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. గాయపడిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఒ.ధనరాజు, కె.రజనీదేవిని పరామర్శించారు. నగర రోడ్లను, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.శ్రీనివాసరావు, రవి కుమార్, జి.ప్రదీప్ కుమార్, బి.శ్రీనివాసరావు, కెబిఆర్.రవి కుమార్, రమేష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'




వైఎస్ఆర్‌కు నివాళులు అర్పిస్తున్న షర్మిల

వైఎస్ఆర్‌కు పిసిసి ఛీఫ్ షర్మిళ నివాళి

ప్రజాశక్తి-రాజానగరం

పిసిసి ఛీఫ్ వైఎస్ షర్మిళ జిల్లా పర్యటనలో భాగంగా రాజానగరం జాతీయ రహదారి నరేంద్రపురం సెంటర్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆమెకు పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్లంరాజు, మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, అంకం గోపి, కుర్రెళ్ళ గంగరాజు, ముప్పుడి శ్రీను, అయిల శేషగిరి తదితరులు ఉన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న సిఐ

ధవళేశ్వరంలో విజిబుల్ పోలీసింగ్..

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

విజిబుల్ పోలీసింగ్ భాగంగా గురువారం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ ఏరియాల్లో సిఐ జివి.వినయ్ మోహన్ పలు ప్రాంతాల్లో పర్యటించారు. సున్నం బట్టీ వీధి, కంచర్ల లైన్, వాడపేటల్లో ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకుని, పోలీస్ ద్వారా చేసే సాయం గురించి వారికి వివరించి, ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కు, లేదా సిఐ, ఎస్ఐలకు తెలయజేసి సాయం పొందాలని సూచించారు. ఆయన వెంట ధవళేశ్వరం ఎస్ఐ వి.క్రాంతి కుమార్, కేశవరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అర్ధరాత్రి చోరీ

ప్రజాశక్తి - శంఖవరం

శంఖవరంలో బుధవారం అర్ధరాత్రి ఒక ఇంట్లో చోరీ జరిగిందని అన్నవరం ఎస్ఐ కిషోర్ బాబు తెలిపారు. పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో పర్వత వరలక్ష్మి తన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. అయితే అర్ధరాత్రి లేచి బాత్ రూమ్‌కు వెళుతుండగా ముసుగు దరించిన వ్యక్తి గోడ దూకి తనను భయపెట్టి మెడలో ఉన్న పుస్తుల తాడు, నల్లపూసల తాడును బలవంతంగా లాక్కుని పారిపోయినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గుర్రప్పాలెం గ్రామంలో ఎస్ఐ నాగార్జున రాజు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గండికోట సత్యనారాయణకు చెందిన పాన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 43 మద్యం బాటిల్స్, అదేవిధంగా గండికోట వీర రాఘవులు షాపులో తనిఖీ చేయగా 30 మద్యం బాటిల్స్ లభించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరి నిందుతులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

హత్య కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఈ నెల 22వ తేదీన చంద్రవరం గ్రామంలో జరిగిన మహిళ హత్యకు కారకుడైన నిందుతుడిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు గురియైన సింహాద్రి సుజాత (48) 15 ఏళ్ల క్రితం భర్త మృతి చెందడంతో తల్లిదండ్రుల స్వగ్రామమైన చంద్రవరంలో గత ఐదేళ్ల నుంచి నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అదే గ్రామానికి చెందిన యాదాలా చైతన్య కుమార్ పెయింటింగ్ పనుల నిమిత్తం సుజాత ఇంటికి వచ్చాడు. నాటి నుంచి ఆమెతో పరిచయడం పెంచుకుని ఎప్పటికప్పుడు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టేవాడు. దీంతో ఆమె తల్లీదండ్రులకు చెప్పడంతో చైతన్య కుమార్‌ను మందలించారు. దీంతో ఆమెపై పగపెంచుకున్న అతడు ఈ నెల 22వ తేదీన సుజాత ఉంటున్న ఇంటిపైకి వెళ్లి దాక్కున్నాడు. ఉదయమే బట్టలు ఆరేసేందుకు పైకి వచ్చిన సుజాతపై ఒక్కసారిగా దాడి చేసి పీకపై కత్తితో కోసి పరారయ్యాడు. హతురాలు తల్లీదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసినట్లు సిఐ ఎవి.రమణ తెలిపారు.

మద్యం కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

ఎస్ఇబి స్టేషన్ పరిదిలో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు నిందుతులను అరెస్టు చేసినట్లు సిఐ కెవి.స్వామి తెలిపారు. మండలంలో ధూమంతునిగూడెం గ్రామానికి చెందిన జక్కంశెట్టి విజయలక్ష్మి అనే మహిళ వద్ద ఉన్న 10 లీటర్ల నాటు సారాను, మండల కేంద్రమైన గోపాలపురంలో ముళ్ళ శ్రీనివాసరావు అమ్మకానికి నిల్వ చేసిన 8 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

576 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని జి. వేమవరం పంచాయతీ పరిధిలోని జగనన్న లేఔట్‌లో 576 మంది లబ్ధిదారులకు ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఇళ్ల స్థలాలను అప్పగించారు. ఎంపిటిసి సభ్యులు యర్రంనీడి అప్పా రావు అధ్యక్షతన గురు వారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందన్నారు. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంటు, ఇనుమును తక్కువ ధరకే అందించడం ద్వారా మరో రూ.1 లక్ష వరకూ మేలు జరుగుతుందని తెలిపారు. ఈనెల 27 నుంచి ప్రతి ఇంటి స్థలం లబ్ధిదారునికి సంబంధిత ఇండ్ల స్థలాల లబ్ధిదారుడుకి ఆయా సచివాలయాల ద్వారా పట్టా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని పటవల పంచాయతీలో రూ. 2 కోట్లతో నిర్మించిన వివిధ భవనాలను ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రారంభించారు. పటవల పంచాయితీ కార్యాలయంపైన రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన పై అంతస్తు సచివాలయం వన్ భవనాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూల నిర్మించిన వాటర్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎను ఆయా గ్రామస్తులు సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, కార్యదర్శి రాయుడు గంగాధర్, స్థానిక సర్పంచ్ పి. కామేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు తణుకు వరలక్ష్మి, బూరెల వెంకటరాజు, దెయ్యాల సత్తిబాబు, మట్ట లింగమూర్తి, నీలపాల శ్రీనివాస్, పినపోతు స్వామి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభం

ప్రజాశక్తి - కరప

తదేకం ఫౌండేషన్ సహకారంతో కొత్తపేట ప్రాంతంలో జనసేన నాయకులు యాళ్ల వీర వెంకట సత్యనారాయణ స్వగృహంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని జనసేన పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పంతం నానాజీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు శిక్షణ వినియోగించుకుని స్వయం ఉపాధి పొందాలని నైపుణ్యం సంపాదించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తదేకం ఫౌండేషన్ ప్రతినిధి చావ్వకుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ' విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రేవతి సైన్స్ ఫౌండేషన్- రామచంద్రపురం ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో సామర్లకోట ప్రతిభ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రాజెక్టులకు బహుమతులు గెలుచుకున్నారు. ఈ విషయాన్ని గురువారం పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వివిజి ప్రకాష్ మీడియాకు వెల్లడించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, రేవతి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారని తెలిపారు. విద్యార్థులను పలువురు ఈ సందర్భంగా అభినందించారు.

యానాం వార్తలు

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొని విద్యార్థులు, బిఎల్ఒలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య విశిష్టతను పెంచాలని ఉద్దేశంతో ప్రతి ఏట కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును పొందాలన్నారు. కొత్త ఓటర్లను పరిపాలన అధికారి సత్కరించారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, ఎస్‌టిపి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నరేష్, బేతాళం కుమార్, బచ్చల సాగర్, సాధనాల బాబు, నోడల్ అధికారులు, బూత్ లెవెల్ సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడామైదానంలో శుక్రవారం పరిపాలనాధికారి మునిస్వామి జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



అవగాహన కల్పిస్తున్న అబ్దుల్ కరీమ్

విజెఎస్‌లో ఉపాధి అంశాలపై అవగాహన

ప్రజాశక్తి-రాజానగరం

స్థానిక దివాన్ చెరువు విజెఎస్ ఫార్మసీ కళాశాలలో వాల్ స్క్వేర్ కన్సల్టెన్సీ ఆధ్వర్యాన ఫార్మసీ విద్యార్థులకు ఐటి రంగంలో ఉపాధి అవకాశాలపై గురువారం డైరెక్టర్ అబ్దుల్ కరీం అవగాహన కల్పించారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మాడి విద్యార్థులకు తమ కోర్సు పూర్తి అనంతరం ఫార్మసీ రంగంలోనే కాక ఐటి రంగంలోనూ ఎన్నో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వివి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు రావడం మంచి పరిణామం అన్నారు. విద్యార్థులంతా ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు పొందే వీలుగా స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని తెలిపారు. కళాశాల చైర్‌పర్సన్ ఎస్.శకుంతల మాట్లాడారు.

కోరుకొండ సిఐగా నాగమురళి

ప్రజాశక్తి - సీతానగరం

కోరుకొండ సిఐగా అడపా నాగమురళి గురువారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం జిల్లా ఉత్తర మండలంలోని కోరుకొండకు నాగమురళజ విజయవాడ నుండి బదిలీపై వచ్చారు. కోరుకొండ సిఐగా పనిచేస్తున్న జి ఉమా మహేశ్వరరావు రాజమహేంద్రవరం సైబర్ క్రైంకు బదిలీపై వెళ్లారు.

అభివృద్ధి, సంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి-అమలాపురం

సంక్షేమం, అభివృద్ధే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం అమలాపురం నియోజకవర్గంలో పలు అభివద్ధి పనులు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమలాపురం నియోజకవర్గంలోని గ్రామ ప్రజలకు మంచినీటి సరఫరా మెరుగుపరిచే విధంగా జల జీవన మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టి మంచినీటి సరఫరా జరిగే విధంగా పనులు చేపట్టామన్నారు. చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు బిటి రోడ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ముందుకు వెళుతున్నట్లు మంత్రి తెలిపారు. తాండవపల్లి గ్రామంలో రూ.51 లక్షలతో చేపట్టిన జల జీవన మిషన్ పనులతో పాటు రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి జి .యేసు రాజు, జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి హరి, ఎంపిపి కుడిపూడి భాగ్యలక్ష్మి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. అల్లవరం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకస్థాపన చేశారు. అమలాపురం పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ మాట్లాడుతూ జిల్లాలో రూ.48 కోట్లతో రోడ్ల నిర్మాణపు పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, సర్పంచ్ ఆర్. విజయలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కె.గౌతమి తదితరులు పాల్గొన్నారు.

నంగవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

ఉప్పలగుప్తం నంగవరంలో గురువారం జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో రూ.23. 94 లక్షలు వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని రూ.20.8 లక్షలుతో నిర్మించిన వెల్ నెస్ సెంటర్ లను మంత్రి విశ్వరూప్, ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాలలో స్థానిక సర్పంచ్, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సన్నవిల్లి, భీమనపల్లి సర్పంచ్ లు పెయ్యల రాజ్ కుమార్, చిక్కం పెదబాబు, ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి క్రీడా జట్ల ఎంపిక

ప్రజాశక్తి- ఆలమూరు

నియోజవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా మండలంలోని చెముడులంకకు చెందిన కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడా జట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యాయని ఎంపిడిఒ కె.జాన్ లింకన్, చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను అభినందించి, మరింత ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ రామ స్వరూప్, పీడీ సత్తిబాబు, ఉప సర్పంచ్ దొండపాటి చంటి, మోటూరు సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లిలో బాల బాలాజీ స్వామి ఆలయ వ్యవస్థాపకులు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భముగా పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వారి కుటుంబ సభ్యులను సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు మరియు ఆలయ ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు , ఎంపిటీసి బొంతు నీలిమ, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి తదితరులు పాల్గొన్నారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు నిర్వహణ అధికారిణి గ్రంధి మాధవి తెలిపారు.

అంగన్‌వాడీల విజయోత్సవ సభ

ప్రజాశక్తి - సీతానగరం

అంగన్వాడీ కోరుకొండ ప్రోజెక్టు ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సీతానగరం తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ, కార్యదర్శి బేబీరాణి, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజయోత్సవ సభలో అంగన్‌వాడీ సమ్మె విజయవంతం చేయడానికి కృషి చేసిన సిఐటియు జిల్లా నాయకులను సత్కరించారు. సమ్మె విజయవంతం కావడంతో విజయోత్సవ సభలో కేక్ కట్ చేసి అంగన్‌వాడీలు ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి, సెక్టార్ లీడర్స్ వెంకటలక్ష్మి, ప్రశాంతి, ఉమ, మండల లీడర్ సువర్ణ కుమారి పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో జిల్లా నాయుకులకు సన్మానం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ అప్పారావు

పౌరులకు సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - నిడదవోలు

గ్రామ సచివాలయాలతో పౌరులకు పోలీస్ సేవలు అందించటమే లక్ష్యమని నిడదవోలు ఎస్ఐ పి.అప్పారావు అన్నారు. మండలంలోని సింగవరం సచివాలయంలో సర్పంచ్ పెన్మత్స వెంకటలక్ష్మి అధ్యక్షతన గురువారం సచివాలయ సిబ్బంది పాలకవర్గం, గ్రామ పెద్దలతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి తనకు కేటాయించిన ప్రాంతాల్లో సామాజిక దుర్గుణాలు, సాంఘిక వ్యతిరేక కార్యకలాపాలపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పెన్మెత్స నిర్మల, ఉప సర్పంచ్ వరదరామరాజు, పంచాయతీ కార్యదర్శి కెవి.సుబ్బన్న, పంచాయతీ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్ రవి, మహిళా పోలీసు గంటా శిరీష, వార్డ్ మెంబర్లు ఎల్లే రాజు, మీసాల శ్రీను, గరికపాటి శ్రీను, చెరుకు శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి- ఉండ్రాజవరం

మండలంలోని వెలివెన్ను, చిలకపాడులో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంబ సభ్యులను నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, వైసిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల ఉత్పత్తికి సాంకేతికత ఇవ్వాలి

ప్రజాశక్తి-కడియం

కొత్త మొక్కల ఉత్పత్తి చేయడంలో కడియం నర్సరీ రైతులు దేశంలోనే ముందున్నారని, వారికి మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ విసి తోలేటి జానకిరామ్‌ను కడియం నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు కోరారు. తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో విసి టి.జానకిరామ్‌ను కడియం కాటన్ నర్సరీ ఫార్మర్ కార్యవర్గ సభ్యులు కలిసి కొన్ని ఒప్పందాలను కుదుర్చుకున్నారు. కడియం నర్సరీ రైతులకు నూతన వంగడాలను తయారు చేయడంలో హార్టికల్చర్ విశ్వవిద్యాలయ నిపుణులతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని, కొత్త పరిజ్ఞానంతో తయారు చేసిన మొక్కలకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఏర్పడుతుందని తెలిపారు. పాలకవర్గం ఉపాధ్యక్షులు పెనుమాక కొడబాబు, కార్యదర్శి గాద నాగేశ్వరరావు, కోశాధికారి తాడాల బాలమురళీ కృష్ణ, సహాయ కోసాధికారి జంగా సుబ్బారావు, పిఆర్ఒ గరగ నాగేశ్వరరావు, డైరెక్టర్లు తాడాల నాగేశ్వరరావు, కొండేపూడి నాగు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్

రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని గురువారం పలుచోట్ల ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ప్రజాప్రతినిధులు, యుటిఎఫ్ నేతలు సంఘీభావం తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

మండపేట రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి చనిపోతే ఒక నెల పెన్షన్ ని మట్టిఖర్చుల క్రింద ఇచ్చేవారన్నారు. దానిని ఈ వైసిపి ప్రభుత్వం రూ.25 వేలు చేసిందన్నారు. 2022 జనవరి నుంచి బకాయి పడ్డ పిఆర్‌సి, డిఎ ఎరియర్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్ మెంట్ పరిధి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలన్నారు. అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన అన్ని హాస్పిటల్స్ లో వైద్యం చేసే విధంగా హెల్త్‌కార్డ్స్ ఉండాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. **ఆలమూరు** తాలూకా స్థాయి పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా తమ హక్కుల సాధన కొరకై ధర్నా చేశారు. వీరికి యుటిఎఫ్ మండల శాఖ సంఘీభావం తెలిపింది. వారు మాట్లాడుతూ పెన్షనర్స్‌కి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు వైవి.రమణ, అద్దరి శ్రీనివాసరావు, పివివిజిఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏడిస్తే సత్తిరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 11వ పిఆర్సీ లోని ఏరియర్స్ ను వెంటనే అందించాలని హెల్త్ కార్డుల ద్వారా అన్ని రకాల వ్యాధులకు వైద్య సదుపాయాలు అందించాలని 11వ పిఆర్‌సిలో తగ్గిన క్వాంటంను యథాతథంగా అందించాలని పెండింగ్ డిఆర్ ల ను వెంటనే విడుదల చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ జిడి.కిషోర్ బాబుకు అందించారు కార్యక్రమాలు ర్యాలీ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాటిక పరిషత్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రమాంపల్లి(దివిలి)స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటిక పరిషత్ పోటీలు కైకాల సత్యనారాయణ కళా ప్రాంగణం, ఇందన నరసారావు కళావేదికపై గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పెద్దాపురం చేనేత సొసైటీ అధ్యక్షులు ముప్పన వీర్రాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. చంద్రమాంపల్లి సర్పంచ్ కురుమళ్ళ లోవరాజు, గోపు నారాయణ మూర్తి ప్రారంభించారు. అనంతరం లోవరాజు, నారాయణమూర్తి మాట్లాడుతూ ఈ పోటీలు నిర్వహిస్తున్న వారిని అభినందించారు. ముప్పన వీర్రాజు మాట్లాడుతూ నాటక రంగం వన్నె తగ్గిపోయిందని అనుకుంటున్న తరుణంలో విశేష ప్రేక్షకాదరణతో ఈ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం శార్వాణి గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీకాకుళం జిల్లా బోరివంకకు చెందిన పిఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో కెకె ఎల్ స్వామి రచించిన 'కొత్త పరిమళం' నాటిక, తెలుగు కళా సమితి విశాఖపట్నంకు చెందిన చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వంలో పిటి.మాధవ్ రచన 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత?' నాటికలు ప్రదర్శించారు. ఈనాటికలు అందర్నీ ఆకట్టుకున్నాయి..అనంతరం డిఎస్‌పి లతా కుమారి చేతులమీదుగా కళాకారులకు, సంస్థలకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్.మూర్తి, గొందేశి రాజా, ఇందన బ్రహ్మానందం, రవీంద్ర, కేదారి నాగు, మంతెన సత్తిబాబు, పాలాని సత్తిబాబు, పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ సిబ్బందికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తమ సమస్యల సాధన కోసం ఇటీవల సమ్మె చేసిన సర్వ శిక్షాభియాన్ సిబ్బందికి సమ్మె కాలానికి ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో వారికి ఉపాధ్యాయులు గురువారం రూ.16 వేల ఆర్థిక సాయం అందించారు. 'సమ్మె సిబ్బందికి సాయం చేద్దాం' అంటూ ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఉపాధ్యాయులు ఈ ఆర్థిక సాయం అందజేశారని దుర్గారావు తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన కార్యక్రమంలో ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ, ఎపిటిఎఫ్ నాయకులు రఘువీర శాస్త్రి, రామచంద్రరావు, శంకరం, నాని, వెంకటరమణ, కష్ణమోహన్ సమ్మె చేసిన సిబ్బంది శ్రీనివాస్, మరియమ్మ, పద్మావతి, భవాని, సురేష్ ఉన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని మల్లవరంలో మాజీ సర్పంచ్ సానాపతులు త్రిమూర్తులు ఆధ్వర్యాన సుమారు 100 మంది టిడిపి నుంచి వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, వైసిపి ఇన్‌ఛార్జి తోట నరసింహం పాల్గొని వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. తోట నరసింహం మాట్లాడుతూ గతంలో మల్లవరంలో రూ.రెండు కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని చెప్పారు.

కొవ్వూరు తరలిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-చాగల్లు

వైసిపి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అధ్యక్షతన కొవ్వూరులో నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు పరిచయ కార్యక్రమానికి చాగల్లు మండలం నుంచి సర్పంచులు, ఎంపిటిసిలు భారీగా తరలి వెళ్లారు. ఎంపిపి మట్టా వీరాస్వామి, వైసిపి మండల అధ్యక్షుడు చెల్లింపురి దుర్గామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు వెళ్లారు.

విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు

ప్రభుత్వం విద్యాభివద్ధికి చేస్తున్న కృషిని సద్వినియోగం చేసుకుని ఉన్నత ప్రమాణాలను సాధించాలని ఊనగట్ల గ్రామ సర్పంచ్ మట్టా వెంకట్రావు అన్నారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్లో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్స్ పంపిణీ చేశారు. అన్నారు. 68 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు, 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఆత్కూరి గోపీచంద్, విద్యాకమిటీ ఛైర్మన్ ఎం.శివ, పుల్లూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.